# యాదృచ్ఛికం

-బి. విజయ

పెండింగ్ ఫైళ్ళ మీద సంతకాలు పెట్టడం పూర్త యింది. చిట్టచివరి ఫైలు మూసి, పెన్ను తీసి జేబులో పెట్టి ఒక్కసారి ఒళ్ళు విరిచాను. ఆపైన వాచీలో టైము చూసుకున్నాను. రెండున్నర దాటి మూడు కావస్తుంది. భోజనానికి సమాయత్తమై నాలుగడుగులు వేశానో లేదో అటెండరు ఆదం టేబుల్‌పై ప్లేట్లు, గ్లాసులు సర్ది నా కోసం సిద్ధంగా ఉన్నాడు. సింక్‌లో చేతులు కడిగి వచ్చేటప్పటికి పోస్టుమేన్ ఎదురు చూపులు. "సాబ్ మీకు ఎంవో వచ్చింది అన్నాడు ప్రశ్నార్థకంగా ఉన్న నా మొహం చూస్తూ. వెంటనే సంతకం చేసి, అతగా డిచ్చిన 400 జేబులో పెట్టి 20 రూపాయలు బక్షీగా ఇచ్చాను. పోస్టుమ్యాన్ చెప్పిన 'థ్యాంక్స్'ను అందుకుని భోజనానికి ఉపక్రమించాను.

నవంబరు మొదటి వారంలో అనుకోకుండా ఆఫీ సు పనిమీద కర్ణాటక, మద్రాసు, కేరళ రాష్ట్రాలు చుట్టి రావలసి వచ్చింది. అక్కడున్న బ్రాంచీల పనితీరును పర్యవేక్షించి, తగిన సూచనలిచ్చి, ప్రోత్సహించి రమ్మని ఎండిగారి ఆదేశం. అందువల్ల భార్యా బిడ్డల్ని భాగ్య నగరంలోనే వదలి ఏకాకిగా నా బాధ్యతల్ని విజయవం తంగా ముగించుకొని మొన్ననే మళ్ళీ ఈ మెయిన్ బ్రాంచికి చేరాను. ఫైళ్ళన్నీ నా కోసం ఎదురు చూస్తు న్నాయి. అందువల్ల వాటిని నిన్నటి ఉదయం నుండి యుద్ధ ప్రాతిపదికపై స్వీకరించి పూర్తిచేశాను. నాకెందుకో కష్టపడి పనిచేస్తే ఎంతో రిలీఫ్‌గా ఉం టుంది. ఒళ్ళంతా గాలిలో తేలియాడినట్లు, మనసంతా హాయిని ఆవరించి ఫ్రీగా ఉంటుంది. అందుకే మా ఎండిలు, చైర్మన్‌లు నన్నిష్టపడతారు. కష్టపడి సంస్థకు పేరు ప్రఖ్యాతులను, అభివృద్ధిని సంపాదించే వారినే అధికా రులు ఇష్టపడతారని మా నాన్న సలహా నిజమే.

భోజనం ముగించి, చేతులు కడిగి, వక్కపొడి స్వీక రించి విశ్రాంతి గదిలోని పడక్కుర్చీలో చేరబడ్డాను. ఒక్క పావుగంట కునుకు తీద్దామనేటంతలో "కర్ణ పిశాచి. మోగింది. సెల్‌కు నేను పెట్టుకున్న ముద్దు పేరది. మా చైర్మన్ గారి నుండి. వెంటనే అలర్టయి వారిని విష్ చేశాను. కుశల ప్రశ్నలు వేశాక, వారు "కేరళ బ్రాంచి పరిస్థితి గమనించావా?" అన్నారు.

"గమనించాను సార్! బ్రాంచి మేనేజరు గారు చాలా యాక్టివ్ సార్!" అన్నాను.

"అలాగైతే అక్కడ కష్టమర్సు ఎందుకు తగ్గారం టావు. మన బిజినెస్ అక్కడ చాలా పూర్‌గా వుం దయ్యా" అన్నారు.

"అవునండి. అదే నాకూ అర్థం కావటంలేదు. మేనేజరు చాలా హార్డ్ వర్కరు. స్టాఫ్ చాలా యాక్టివ్‌గా ఉన్నారు. బిజినెస్ మాత్రం డౌనయింది. ఎందుకా అని ఆలోచిస్తున్నాను" అన్నాను నేను. ఇంకా తరచి తరచి ఆలోచించాలనే భావన వ్యక్తంచేస్తూ, నా ఖంగారును దాస్తూ.

"అలాగని ఖంగారను పడకండి. బాగా ఆలో చించి, తగిన సూచనలివ్వండి. మరీ అవసరమైతే ఈసారి నేనూ, ఎండి కూడా వచ్చి కస్టమర్స్‌తో ఒక అవగాహనా సమావేశం నిర్వహిద్దాం" అన్నారు.

ఓకే సార్, అంతకన్నానా. థాంక్యూ ఫర్ యువర్ కైండ్‌హెల్ప్ అన్నాను నిజాయితీగా వారిని పొగుడుతూ.

"ఆc! చెప్పటం మరిచాను. మీరు ఒక వారం విశ్రాంతి తీసుకోండి. ఇంటిలో వాళ్ళతో గడపండి" అన్నారు సెల్ ఆఫ్ చేస్తూ.

నిజంగా మా చైర్మన్ చాలా సమర్థుడు. కష్టపడి అంచెలంచెలుగా ఎదిగి కోటీశ్వరుడైన విష్ణు రూపం లోని వామనమూర్తి అనవచ్చు. ప్రతి విషయాన్ని లోతుగా ఆలోచిస్తారు. తొందరపాటు తనం ఉండదు. అలాగని దేన్నీ తేలిగ్గా తీసుకోడు. ఆచి, తూచి వ్యవహరిస్తారు. అధికారులతో గాని, మిగిలిన సిబ్బం దితో గాని, కష్టమర్సుతో గాని చాలా ఫ్రీగా మాట్లాడ తారు. చనువుగా పిలుస్తూ ఇట్టే కలిసిపోతారు. ఎదుటి వారి నుండి పనిని రాబట్టుకోవడంలో సమర్థుడు. కష్టపడిన వారిని గుర్తించి, ప్రోత్సహించటంలో మరీ సమర్థుడు. సిబ్బందిని తన దగ్గరకు రప్పించుకోవడమే కాదు, సిబ్బంది దగ్గరకు పరుగెత్తుకొని వచ్చి తనక్కా వలసిన పనిని రాబట్టుకోగలడు. ఆ తత్త్వమే ఆయన్నం తటివాడిని చేసింది. రెండు నెలలపాటు కష్టపడ్డ నాకు భార్యా బిడ్డలతో గడిపే అవకాశం ఆయనే ఇచ్చారు. అంతే కాదు, అవసరమైతే ఎంతో కొంత చెక్కు కూడా రేపు నాకు అందుతుందని తెలుసు. ఈ వారంలో నా హనీమూన్‌కు సంబంధించి నాకే సాయం కావాలన్నా

రింగ్ చేస్తే చాలు ఏర్పాటు చేస్తారు వారు. ఈ వారం రాణిని, బాబును తీసుకొని షిర్డీ, బొంబాయిలు చుట్టి రావాలని ఆలోచిస్తున్నాను.

ఇలా మా చైర్మన్ గారి గురించీ, నా యాత్ర గురించీ ఆలోచిస్తూ ఓ పది నిమిషాల పాటు నడుం వాల్చి పడక్కుర్చీనుండి లేచాను నా ఛాంబర్‌లోకి వెళ్ళాలని. అప్పుడు గుర్తుకొచ్చింది నాకు వచ్చిన ఎంవో. అన్నం తినే హడావుడిలో సడి వాటిని జేబులోకి నెట్టాను గాని ఎక్కడి నుండి వచ్చిందో చూడలేదు. తిరిగి డబ్బుతో పాటు, ఎంవో క్రింద నుండి చించి పోస్ట్‌మ్యాన్ నాకిచ్చిన కమ్యూనికేషన్ రిసిప్ట్ తీసి చదివాను. ఒక ప్రసిద్ధ పత్రిక నా ఆర్టికల్ తమ పత్రికలో పడినందుకు ఇచ్చిన రెమ్యునరేషన్.

"Remunaration for your contribution in our daily for the month of November 2005" అని ఉంది. ఆ నోట్లను మరోసారి తీసి అపు రూపంగా తడిమాను. రచయితగా నాకు వచ్చిన బహు మానం. ఇది నాకు లక్షల కన్నా మిన్న. కథలు, కవితలు, వ్యాసాలు వ్రాయడం, పంపటం నా ప్రవృత్తి. వ్రాయడం చాలా అరుదు. తల్లి ప్రసవ వేదనపడి బిడ్డను ఎలా కంటుందో నా రచనా అంతే. మనసు బాగా స్పందిం చాలి. ప్రయాణంలో ఒంటరిగా ఉంటే ఆలోచించి స్కెచ్ గీసుకుంటాను ఊహాత్మకంగా. ఆ తరువాత స్పష్టమైన ఆ ఊహలకు అక్షరరూపం ఇస్తాను. రాత్రి పూట అందరూ నిద్రించి, నిశ్శబ్దంగా ఉన్న వేళ వ్రాయ డం అలవాటు. మరలా ఎన్నో మార్పులు, చేర్పులు చేసి నా మనస్సు తృప్తిపడ్డాకే పంపుతాను. కనీసం ఐదు లేక ఆరు రఫ్‌లు తయారైతేగాని వాస్తవ రూపం పొందదు. అయితే నేను వ్రాసిందే చాలా తక్కువ. పట్టుమని ఓ పది కథలు, ఇరవై కవితలు, నాలుగైదు వ్యాసాలు ప్రచురింపబడ్డాయి ఈ పదేళ్ళలో. వ్రాయడం కన్నా ప్రచురించడం ఎక్కువ. అయితే నేను క్యాంపుకు వెళ్ళక ముందు సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఈ పత్రికకు ఏం పంపానో డైరీ తీసి చూసుకున్నాను. సెప్టెంబరు నెలలో ఒక కథ, రెండు కవితలు పంపాను. కథ తిరిగి వచ్చింది వెంటనే. అక్టోబరు నెలలో రెండు వ్యాసాలు పంపాను. వీటిల్లో ఏవి ప్రచురింపబడినాయా అని ఆలోచించాను. జనవరి నుండి సెప్టెంబరు నా చేతిలో తయారైనవి అవే. 400 రూపాయల రెమ్యూన రేషన్ అంటే ఖచ్చితంగా నా వ్యాసానికే అయి వుం టుంది. ఆఫీసు వ్యవహారాల్లో ఉండి ఈ రెండు నెలలు

## తరాల అంతరాలు..!!

గత స్మృతులు ఓ అద్భుత అనుభవాల సంపుటాలు
అందులోని పుటల్లో ఎన్నో అరుదైన సంఘటనలు..!
మన పూర్వీకుల సనాతన ధర్మాల సుభాషితాలు
పురాణేతిహాసాల, వేదాల, ధర్మసూక్ష్మ దర్శనాలు..!!
అవి తరతరాల చరిత్రకు సజీవ సాక్ష్యాలు
ఆర్ష సంస్కృతీ సంప్రదాయాల ప్రతిరూపాలు..!
భారతీయుల మదిలో నినదించే ఓంకార నాదాలు..
అజరామరమైన కీర్తి కిరణాలకు జయసంకే తాలు..!!
ప్రస్తుత వాతావరణం అంతా అస్తవ్యస్థం..
వర్తమానం వేగంగా పరివర్తనం చెందాలని ఆరాటం..!
యువత విదేశీ వ్యామోహం పొగబారిన బ్రతుకు చిత్రం
పరభాషా సంస్కృతి చాటున నిలకడలేని యువ తరం
మాతృభాషాభిమానాన్ని విస్మరించే సంక్లిష్ట తరుణం..!!
నేడు నాగరికతా నగరాల్లో అర్ధరాత్రి వేళ అశ్లీల నృత్యాలు
వనితల అంగాంగ ప్రదర్శనల అసభ్య దృశ్యాలు..!
పబ్బుల్లో, క్లబ్బుల్లో, మధుపాన ప్రియుల అల్లరి ఆగడాలు
సెల్‌ఫోనుల్లో విటుల రహస్య వ్యభిచార వ్యాపారాలు..!
విశృంఖలంగా విజృంభిస్తున్న మహిళలపై అత్యా చారాలు
శిక్షించాల్సిన రక్షక భటులే ప్రేక్షక పాత్రధారులు..!!
రామాయణంలోని ధర్మ పరిపాలనాంశం
ఈనాడు అదొక పరిహాసాల ప్రహసనం..!
భారతంలోని కీచక పర్వాలు నిత్యం పునరావృతం
ఈ కలియుగ రాక్షసులను నిరోధించే వారు లేనేలేరా..?
అందుకే ఓ గౌతమ బుద్ధుడు.. ఓ గాంధీ మహాత్ముడు
మళ్ళీ మన దేశంలో అవతరించినప్పుడే..
ఈ ఆవేదనలకు, 'తరాల అంతరాల'కు తెరపడేది..
అంతవరకూ మనమంతా నిమిత్తమాత్రులం..!!

-తంగెళ్ళ పాండురంగశర్మ

దినపత్రికలు చూడనేలేదు. టీవిలో వార్తలు వినడమే జరిగింది. ప్రయాణంలో నేను తీసుకెళ్ళిన విపుల, చతుర, రచన, స్వాతి పత్రిక, వివిధ పత్రికల పాత ఆదివారం అనుబంధాలు చదవటం జరిగింది. ప్రతి రోజూ ఒక దినపత్రికను మాత్రమే తెప్పించే నేను, ఆదివారం మాత్రం అన్ని దినపత్రికలూ తెప్పిస్తాను. వీలున్నపుడల్లా అనుబంధాలు తప్పక చదువుతాను. కాని ఈ ట్రిప్ వల్ల డైలీ చదవడం వీలుకాలేదు. ఈ దినపత్రికను నవంబరు నెల కాపీలన్నీ తెప్పించడం కష్టమైన పని. మనమే ఏదైనా లైబ్రరీకి వెళ్ళి చూడాలి. మా ఆదంను పంపవచ్చుగాని సొంత పనులకు అటెండర్లను పురమాయించడం అంత ఇష్టం ఉండదు. పంపినా వాళ్ళు బాధ్యతగా ఇలాంటి విషయాల్లో మసలకోవటం కష్టం. బాగా ఆలోచించాను. చటుక్కున ఐడియా మెరుపులా మెరిసింది. పత్రిక ఆఫీసుకు ఫోనుచేసి ఏ రోజు దినపత్రికలో ప్రచురింపబడిందో కనుక్కుంటే లైబ్రరీకి వెళ్ళి దాన్ని సాధించవచ్చు. అంతే. నా (కర్ణ పిశాచిని) సెల్‌ని తీశాను. నా డైరీలోని

## ఎందుకో మరి

**కొ**ట్లాడుకోవడానికి
కోటి కారణాలు వెతుక్కునేవాళ్ళు
కలసి వుండడానికి
ఒక్క ప్రయత్నమూ చెయ్యరెందుకో మరి!

## కరస్పర్శ

**నువ్వు** కరస్పర్శకై చేయి చాచితే
అది ఎన్నో అభయహస్తాల నందిస్తుంది
గిరి గీసుకున్న ఒంటరివి అయితే
ఆపన్నహస్తం అదృశ్యమవుతుంది!

## మానవత్వం

**మా**ననీయులు.. మహనీయులు
ఎక్కడో లేరు / మనసులో మానవత్వముంటే
నువ్వే మహాత్ముడవు!

## మిణుగురు

**మి**రుమిట్లు గొలిపే / మెరుపు లవ్వక్కర్లేదు
తిమిరాన్ని పారద్రోలే / మిణుగురువైతే చాలు!

**-పి.వి.సుబ్బారాయుడు**

నంబరు తీసి ఫోన్ చేశాను. అటునుండి వెంటనే మర్యాదపూర్వకమైన మాటలతో ఏం కావాలి అని అడిగారు.

"మేడం! మీ పత్రిక నుండి నాకు 400 రూపాయల ఎంవో ఈరోజే వచ్చింది. నేను అక్టోబరులో మీకు రెండు వ్యాసాలు, అంతకు ముందు నెలలో కవితలు పంపాను. "నా పేరు సుధాకర్.డి. నేను అపరంజి కార్పొరేషన్‌లో గైడెన్స్ ఆఫీసరుగా పనిచేస్తున్నాను. నేను రెండు నెలలపాటు రాష్ట్రాన్ని వదలటం వల్ల నా రచన ఏ తేదీన వచ్చిందో చూసుకోలేదు. దయచేసి చెప్పరూ" అని అడిగాను. పై మాటలను ఎంతో సున్నితంగా, మర్యాద పూర్వకంగా అడిగాను. అది కూడా ఒక అభ్యర్థన ధ్వనించే విధంగా కోరాను. పత్రిక చూసుకోక పోవడం నా తప్పిదం అన్నట్లుగానే నా మాటలున్నాయి. మర్యాద ఇచ్చి పుచ్చుకునే ధోరణి నాకు నా తల్లిదండ్రులిచ్చిన వారసత్వ లక్షణం.

ఆమె నాకు జవాబుగా, "ఒక్క నిమిషం ఆగండి" అంటూ శశిధర్ అనిపిలిచి, వారికి నా విజ్ఞప్తిని అలాగే వివరించి, "మీరు శశిధర్ గారితో మాటాడండి" అన్నారు. నేను ఓకే మేడం. థాంక్యూ అనగానే అతగాడు నాన్‌స్టాప్‌గా చీవాట్లు పెట్టాడు. ఇటువంటి మాటలు, ఇలా వినటం ఇదే మొదటిసారేమో! నా బాధ్యతా రాహిత్యాన్ని వివరించి, నన్ను వాయించాడు గాని నాకు కావలసిన సమాచారం ఇవ్వలేదు. నా మూడంతా పాడైంది. నా రచన పడిన ఆనందం గాని, 400 రెమ్యూనరేషన్ అందుకున్న సంతోషం గాని మచ్చుకు కూడా లేకుండా గాలిలో కలిసినట్లు వెళ్ళిపోయాయి. అతడన్న ఒక్కో మాట ఒక్కొక్క బాణం. అతడి మాటలు సూటిగా ఇలాగే ఉన్నాయి.

"మీరు రాసి పంపితే సరిపోతుందా? మీ రచనను మేం ప్రచురించి ప్రోత్సహిస్తే చూసుకునే బాధ్యత మీకు లేదా? You are insulting me. మీరిలా అడక్కూడదు. మిమ్మల్ని మా పత్రికను తెప్పించుకోమని అడగడంలేదు. మీ రచనను మీరు వెతికి చూసుకోలేదు.."

మధ్యలోనే అందుకుంటూ "నేను ఈ రెండు నెలలు ఈ రాష్ట్రంలో లేనండీ. ఆఫీసు పని మీదు... అంటూ సంజాయిషీ ఇవ్వబోయాను. కాని ఆయన నా మాటలు వినిపించుకోకుండా తన వాగ్ధాటిని ప్రదర్శించారు.

"ఆ రాష్ట్రాలగ్గూడా మా పేపరు వస్తుంది. లైబ్రరీకి వెళ్ళి చూడాలి. మీరు మా పత్రికకు రచనలు పంపండి. తప్పకుండా వేస్తాం. కాని మీ రచన పడిందో లేదో

చూసుకునే బాధ్యత మీదే." అంతే వెంటనే ఫోన్ పెట్టేశారు.

ముందు నాకిది చాలా అవమానంగా తోచింది. బాధ కూడా కలిగింది. సాయంతం ఐదు గంటల వరకు అన్యమనస్కంగానే గడిపాను. కారెక్కబోతూ ఆలోచించాను. ఒక్కసారి ఎడిటర్ గారిని కలిస్తే. అంతే. మళ్ళీ రింగ్ చేశాను ఎడిటర్ గారు కావాలం టూ. వారు లేరని, పని మీద బయటకు వెళ్ళారని, ఇలాంటి విషయాల్లో కలవటం కష్టమని, అపాయింట్ మెంట్ తీసుకోవాలని వివరించారామె. నా సంతో షాన్ని, ఆ తరువాత కలిగిన ఈ బాధను రాణితో పంచుకుంటే గాని మనసు తేలిక పడదు. అందుకే ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టాను. కారు ట్యాంక్ బండ్ మీదుగా నడుస్తుంది. చల్లటి గాలి మొహాన్ని తాకి హాయిగా ఉంది. హుస్సేన్ సాగర్ జలాలపై చల్లదనాన్ని మోస్తున్న గాలి ఆనంద పరవశమైన ప్రియురాలిలా ఉంది. అయినా మళ్ళీ అవే ఆలోచనలు. అతని మాటలు నాకు అవమానాన్ని, బాధను మిగిల్చాయి.

"ఎడిటర్ గారికి లేఖ వ్రాస్తే.." అనిపించింది ఎందుకో. వెంటనే యాదయ్యను కారు స్టాప్ చేయ మన్నాను. ఒక్క పది నిమిషాలు టీ త్రాగి రమ్మని చెప్పి పది నోటిచ్చి పంపాను. ప్రశాంతంగా తిక్కన గారి విగ్రహం ముందు కూర్చున్నాను. జరిగిన విష యాన్ని సూటిగా, స్పష్టంగా వ్రాశాను. "నేను సంబం ధిత వ్యక్తి మీద అభియోగాన్ని మోపడానికి ఈ లేఖ వ్రాయడంలేదు. ఒక మంచి పత్రికకు, ఉన్నతస్థాయి అధికారి మీరు. అందువలన మీ క్రింది ఉద్యోగికి తగిన సూచనలిచ్చి మార్గదర్శకం చేసి మన పత్రిక గౌరవాన్ని, ఔన్నత్యాన్ని కాపాడాలి. పత్రికను చూసుకోక పోవటం నా తప్పే. కాని ఏ తేదీన ప్రచురింపబడిందో ఒక్క మాట చెప్పవచ్చుగా. ఇబ్బందులేమైనా ఉంటే అలా చెప్పడానికి వీలుపడదు అని సున్నితంగా చెప్పవచ్చు గదా! నేను ఎందుకు తిరిగి అతనితో వాదించలేదంటే వాదన తగువుకు దారితీస్తుందే గాని, పరిష్కారం చూపదు. అపరిచిత వ్యక్తితో ఫోనులో వాదించరాదనేది నా అభిమతం. ఒకవేళ ఈ విషయం లో నా లొసుగు ఏదైనా ఉంటే నాకు కూడా సూచనలను ఇవ్వండి. నేను తప్పక రిసీవ్ చేసుకుంటాను. ఆచరి స్తాను. ఆ వ్యక్తి శిక్షింపబడాలనో, మరేదో కావాలనో ఈ లేఖ రాయడంలేదు. శిక్ష కన్నా శిక్షణ ముఖ్యమని నా భావన. మీ సంస్థలో జరిగే విషయాలు మీకు తెలియ పరచాలని నా భావన. అతగాడు నాతో మాటాడి నట్లే ఆ రోజు నలుగురితో మాటాడానని అన్నాడు. అందు వల్ల మన పత్రికకు మంచి రచయితలు, పాఠకులు దూరం కావచ్చు. ఉన్నత విలువలు గల పత్రిక, ప్రతి విషయంలోను చక్కగా స్పందించే పత్రిక మరింత ఎదగాలనే ఆశతో వ్రాస్తున్నాను." కవరు అంటించి, కొరియర్ చేసి ఇంటికి వెడదామని లేచాను. యాదయ్య డోర్ తీసి సిద్ధంగా ఉన్నాడు. కారెక్కాను.

దగ్గరలో ఉన్న కొరియర్‌కు వెళ్ళి నా లేఖను పంపాను. కొరియర్ చేసి బయటకు వస్తూ, ఇలాంటి వాళ్ళు నల్గురుంటే పత్రిక మూసుకోవడమే అనే మాట నా మనసులోకి రావడం జరిగింది. అంతే ఎందుకో తెలియదు గాని కేరళ బ్రాంచి తళుక్కున మెరిసింది నా మనసులో. కష్టమర్సుకు, బ్రాంచి మేనేజరుకు మధ్య వారధి సరిగా లేదేమో అనే యోచన వచ్చింది. వెంటనే, కేరళ బ్రాంచి మేనేజర్ రమేష్‌కు ఫోన్ చేశాను. ఈ ఏడాది కొత్తగా వచ్చిన స్టాఫ్ ఎవరు, వాళ్ళ బిహేవి యర్ ఏమిటి ఎంక్వయిరీ చేయమన్నాను. మన కంపెనీ పట్ల అభిమానమున్న కష్టమర్లను పిలిచి వారి ఇబ్బం దులు ఏమైనా ఉంటే అడగమన్నాను. వచ్చే 16 నాడు కష్టమర్లతో నా మీట్ ఏర్పాటు చేయమని సలహా ఇచ్చాను.

"ఎంక్వయిరీ సెల్.. - సరైన ట్రాక్‌లో లేకుంటే కష్టమర్లు ఆటోమేటిక్‌గా దూరమౌతారు. అవును నాలా ఎంతమంది ఆలోచిస్తారు? వెంటనే మళ్ళీ ఫోను చేసి కష్టమర్లతో మాటాడి కష్టసుఖాలు తెలుసుకోవడానికి మెయిన్ బ్రాంచి నుండి మిస్ మాలతి వస్తున్నట్లు ప్రకటించమని మేనేజర్‌కి వివరించాను.

అయితే కవిత గాని, కథ గాని, వ్యాసం గానీ పంపే రచయిత సొంత చిరునామా కవరు పెడతాడు. దాని మీదనే మీ రచన ఎంపికైంది. అన్న వాక్యం వ్రాసి పంపితే చాలు రచయిత ఆ పత్రికను గమని స్తాడు. అలా సొంత చిరునామా గల కవరును జతపర చిన వారికి ఒక కార్డు ముక్క వ్రాస్తే చాలు. అంత పెద్ద సంస్థకు ఇదేం ఇబ్బంది కాదు. ఈ విషయాన్ని అన్ని పత్రికలకు వ్రాతపూర్వకంగా తెలియజేయాలను కున్నాను. ఎందుకంటే రచయితలు రెమ్యునరేషన్ కన్నా తమ రచనను అచ్చులో చూసుకొని ఆనందించే అభినవ పోతన్నలు. ఒక సంఘటన మరియొక్క సమస్య పరిష్కా రానికి మూలం కావడం యాదృచ్ఛికం. ■